
ప్రజాశక్తి
గురువారం 23 నవంబర్ 2023
5
పార్వతీపురం మన్యం



ఉపాధి హామీ అధికారిపై దాడి?

ప్రజాశక్తి- సాలూరు

ఉపాధిహామీ చట్టం ఎపిఒగా గతంలో పనిచేసిన ఓ అధికారి పై కొంతమంది వ్యక్తులు దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. బుధవారం మండలంలో ఉపాధి హామీ చట్టం కింద జరిగిన పనులపై ఆడిటింగ్ ప్రారంభమైంది. గతంలో ఇక్కడ పని చేసి బదిలీపై వెళ్లిపోయిన అధికారి ఆడిటింగ్ నిమిత్తం ఎంపిడిఒ కార్యాలయానికి వచ్చారు. కొద్దినెలల క్రితం ఉపాధి హామీ చట్టంలో అవినీతి, అక్రమాల ఆరోపణలపై ఒక ఉద్యోగి సస్పెండ్ అయ్యారు. తన సస్పెన్షన్‌కు కారణం ఆ అధికారే కారణమని భావిస్తున్న ఉద్యోగి బంధువులు ఎంపిడిఒ కార్యాలయంలో అనూహ్యంగా ప్రత్యక్షమై అధికారిపై దాడి చేసినట్లు తెలిసింది. అయితే దాడికి గురైన అధికారి గానీ, కార్యాలయం అధికారి గానీ పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం.



మూతపడ్డ జీడి ప్రాసెసింగ్ కేంద్రం (ఫైల్)

ఏజెన్సీలో కానరాని పారిశ్రామిక ప్రగతి

- వలసబాట పడుతున్న గిరిజన యువత
- ఆచరణకు నోచని పాలకుల హామీలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం, కురుపాం, కొమరాడ, జియ్యమ్మవలస, సీతంపేట, భామిని తదితర ఏజెన్సీ మండలాల్లో పారిశ్రామిక ప్రగతి పడకేసింది. దీంతో ఈ ప్రాంత గిరిజన యువత ఉపాధి కోసం వలస బాట పడుతున్నారు. ఈ ప్రాంతంలో చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పి గిరిజనులకు ఉపాధి కల్పించాలని గత కొనేళ్ల గా కోరుతున్నా ఏ ప్రభుత్వమూ ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. దీంతో వందలాదిమంది చదువుకున్న గిరిజన నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాల్లేక తీవ్ర నిరాశతో ఉన్నారు. మన్య ప్రాంతంలో పుష్కలమైన సహజవనరులు ఉన్నాయి. అధికారులు దృష్టి సారించి గిరిజనులను ప్రోత్సహించి ఉపాధి కల్పిస్తే నిరుద్యోగ సమస్య కొంతమేర తీరుతుంది. తద్వారా గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి వీలుంటుంది. స్థానికంగా గిరిజనులకు ఉపాధి కల్పించాలనే ఆలోచనతో గుమ్మలక్ష్మీపురంలో ఏర్పాటు చేసిన పలు పరిశ్రమలు నిర్వహణాలోపంతో మూలనపడ్డాయి. బనియన్ ఫ్యాక్టరీ, పట్టు పరిశ్రమ, చేపల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేశారు. ఎస్‌కె పాడు నర్సరీలో మొక్కలకు అంట్లు కట్టడంపై, కొమరాడలో జీడి ప్రోసెసింగ్ యూనిట్ల ఏర్పాటులో గిరిజనులకు శిక్షణతో పాటు ఉపాధి కల్పించారు. ప్రభుత్వానికి ఆదాయం, గిరిజనులకు ఉపాధితో ఎంతో ప్రయోజనకరంగా ఉండేది. అయితే పై వాటికి రూపకల్పన చేసిన అధికారులు బదిలీలపై వెళ్లడంతో తర్వాత వచ్చిన పిఒలు పెద్దగా దృష్టి సారించకపోవడంతో రానురాను మరుగున పడ్డాయి. గతంలో పార్వతీపురం ఐటిడిఎ పిఒగా పనిచేసిన సువర్ణ పండాదాస్ నిరుద్యోగ మహిళలను ప్రోత్సహించేందుకు ఫ్యాషన్ టెక్నాలజీలో కుట్టుమిషన్‌లో శిక్షణ ఇచ్చారు. అయితే శిక్షణ అనంతరం స్థానికంగా ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో బెంగళూరు, చెన్నై వంటి దూరప్రాంతాలకు పంపించడంతో వారు ఆసక్తి చూపలేదు. మరోవైపు జీడి గిరిజన రైతులను ప్రోత్సహించేందుకు జీడి పిక్కల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు సన్నాహాలు చేశారు. ఇందుకోసం జెకె పాడు, ఇరిడి, దురుబిలి, కొమరాడ తదితర గ్రామాల్లో ప్రాసెసింగ్ యూనిట్ల కేంద్రాలకు భవనాలు నిర్మించారు. యంత్ర సామగ్రి కూడా కొనుగోలు చేసి సిద్ధం చేశారు. కొంత మంది జీడి రైతులను చెన్నై పంపించి ప్రాసెసింగ్ యూనిట్ నిర్వహణపై శిక్షణ కూడా అందించారు. అంతా బాగానే ఉన్నా చివరి నిమిషంలో ఆయన బదిలీపై వెళ్లడంతో తర్వాత వచ్చిన అధికారులు పట్టించుకోకపోవడంతో మూలనపడ్డాయి.

వేల ఎకరాల్లో చింత, జీడి సాగు...

పార్వతీపురం మన్యం జిల్లాలోని ఐటిడిఎ పరిధిలోని 50 వేల ఎకరాల్లో జీడి పంట సాగులో ఉంది. గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లోనే 35 వేల ఎకరాల్లో జీడి తోటలు ఉన్నాయి. ఏటా సుమారు పది వేల క్వింటాళ్ల జీడి పంట దిగుబడి వస్తుందని అంచనా. గిరిజన రైతులు జీడి పంటపై ఎంతమేర ఆధారపడి ఉన్నారో అర్థమవుతోంది. మరోవైపు ఐటిడిఎ పరిధిలో 40 వేల ఎకరాల్లో చింత చెట్లు ఉన్నాయి. ప్రతి ఏటా 10 వేల క్వింటాళ్ల వరకు చింతపండు దిగుబడి వస్తోంది.

ఉపాధి లేక వలస బాట

ఏజెన్సీ ప్రాంతంలో చదువుకుని ఉన్న గిరిజన యువతీ, యువకులకు ఉద్యోగ ఉపాధి కల్పన లేక దూర ప్రాంతాలకు వలస పట్ల పట్టాల్సి వస్తుంది. గుమ్మలక్ష్మీపురంలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రం మూసి వేయడంతో యువత నిరాశలో ఉన్నారు. ప్రభుత్వం చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసే వలసలను నివారించాలి.

కోలక అవినాష్,
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి

చేపల కేంద్రాన్ని అభివృద్ధి పర్చాలి..

డుమ్మంగిలో ఉన్న చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంపై ఐటిడిఎ అధికారులు దృష్టి సారించి అభివృద్ధి పర్చేందుకు చర్యలు చేపట్టాలి. చేప పిల్లల ఉత్పత్తి ద్వారా గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. సొసైటీలు ఏర్పాటు చేసి చేప పిల్లలను అమ్మకాలు చేపడితే ప్రభుత్వానికి లక్షల రూపాయలు ఆదాయం వస్తుంది.

పాలక క్రాంతికుమార్
సర్పంచి డుమ్మంగి

పరిశ్రమలు ఏర్పాటు చేయాలి....

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో జీడి, చింతపండు, కొండ చీపుర్లు ప్రాసెసింగ్ చేసేందుకు చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి గిరిజనులకు ఉపాధి కల్పించాలి. గత కొన్నేళ్ల నుంచి ఏజెన్సీలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా నేటి వరకు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. గిరిజనులకు ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

నందివాడ కృష్ణ బాబు
టిడిపి అరకు పార్లమెంట్ ఎస్.టి అధి కార ప్రతినిధి

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి...

గిరిజనులు పండించే జీడి, చింతపండును ఐటిడిఎ, జిసిసి, వెలుగు ద్వారా కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. గిరిజనులు పండించే పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. అధికారులు గ్రామాల్లోకి నేరుగా వచ్చి అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేయాలి.

పి. తిరుపతిరావు
సిపిఎం మండల నాయకులు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఓటరు జాబితాలో సమస్యలుంటే పరిష్కరిస్తాం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఓటరు జాబితాలో సమస్యలు ఉంటే చెప్పండి... శత శాతం పరిష్కరిస్తామని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం తన కార్యాలయంలో ఎన్నికల అంశాల పట్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు, నిబంధనల మేరకు ఓటరు జాబితా సవరణ జరుగుతోందన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిని బాధ్యులను చేస్తామని స్పష్టం చేశారు. జిల్లాలో ఓటరు జాబితాపై ఎటువంటి అనుమానాలు, సంఘటనలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఇవిఎం తనిఖీలు పారదర్శకంగా జరిగాయని, ఎన్నికల కమిషన్ అధికారులు రేండమైజేషన్ చేస్తారని ఆయన పేర్కొన్నారు.

సంచార వాహనాల ద్వారా ఓటరు అవగాహన

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఇవిఎం)పై సంచార వాహనాల ద్వారా ఓటరు అవగాహన కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఓటరుకు పూర్తి స్థాయి అవగాహన లక్ష్యంగా అన్ని చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. సంచార వాహనాల్లో దృశ్య, శ్రవణ పరికరాలు ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. వాహనంలో ఒక అధికారిని కూడా నియమిస్తున్నట్లు చెప్పారు. ఒకే విధమైన ఫోటో ఉన్నట్లు గుర్తించినా, ఒకే ప్రాంతంలో ఒకే విధమైన ఓటర్లు ఉన్నట్లు గుర్తించినా ఎన్నికల కమిషన్ నిబంధనలు, ఆదేశాల మేరకు విచారణ చేయడం జరుగుతోందనిఅన్నారు. 6461 ఫారం - 6 దరఖాస్తులు, 5580 ఫారం - 7 దరఖాస్తులు, 10351 ఫారం - 8 దరఖాస్తులు విచారణ పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 20251 ఓటర్లను చేర్చగా, 21573 ఓటర్లను తొలగించామని, 77018 ఓటర్ల వివరాల్లో చేర్పులు, మార్పులు జరిగాయని ఆయన చెప్పారు.

2,3 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు

డిసెంబరు 2,3 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపడుతున్నట్టు కలెక్టర్ వివరించారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి ఓటరుగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. యువత ఓటరుగా నమోదుకు ముందుకు రావాలని కోరారు. ఇప్పటి వరకు ఓటరుగా నమోదు చేసుకోని వారు, ఓటరు జాబితాలో పేరు లేని వారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అక్టోబరు 27న ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేశామని, ముసాయిదా ఓటరు జాబితాపై క్లైములు, అభ్యంతరాలను డిసెంబరు 9 వరకు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. డిసెంబరు 26 నాటికి వాటిని పరిష్కరిస్తామని, 2024 జనవరి 5న తుది జాబితా ప్రచురణ సిద్ధం అవుతుందని స్పష్టం చేశారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం రోజుల్లో పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ స్థాయి అధికారులు ఉంటారని పేర్కొన్నారు. ఒకేసారి పెద్ద ఎత్తున ఓటరు నమోదు దరఖాస్తులు స్వీకరించడం జరగదని స్పష్టం చేశారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ జిల్లాలో ఓటరు నమోదులో ఎటువంటి సమస్యలు, లోపాలు లేవని చక్కగా సాగుతుందని అన్నారు. ఇవిఎంల మాక్‌పోల్‌కు అంతా హాజరయ్యామని, అవగాహన పొందామని తెలిపారు. సమావేశంలో డిఆర్‌ఒ జె.వెంకటరావు, కెఆర్‌ఆర్‌సి ఎస్‌డిసి జి.కేశవ నాయుడు, పర్యవేక్షకులు డి.రవికుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి

గురువు అవతారమెత్తిన పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ పిఒ కల్పనకుమారి ఉపాధ్యాయురాలిగా అవతారమెత్తి విద్యార్థులకు పాఠాలు బోధించారు. బుధవారం మల్లి గురుకుల పాఠశాలను పిఒ పరిశీలించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. వారికి గణితం, హిందీ, జాగ్రఫీ సబ్జెక్టులను బోధించారు. పాఠశాల అయిపోయిన తర్వాత అదనంగా నిర్వహించే స్టడీ అవర్లను విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. ఆ సమయంలో అన్ని సబ్జెక్టులకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడారు. బోధనా సామర్థ్యాల పెంపుపై పలు సూచనలు చేశారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచాలన్నారు. అదే విధంగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, వాసుదేవరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కుమ్మరిగండిని పరిశీలించిన పిఒ

మండలంలోని కుమ్మరిగండి గ్రామాన్ని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో పిఒ మాట్లాడారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే పరీక్షలకు పుస్తకాలు ఇప్పించాలని కోరారు. గ్రామంలో నిర్మించిన అంగన్వాడీ భవనానికి బిల్లులు చెల్లించలేదని తెలిపారు. వారు తెలిపిన సమస్యలపై పిఒ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ గీతాంజలి, ఎపిఒ సాగర్, గృహ నిర్మాణశాఖ ఎఇ వెంకటేష్, ఎపిఎం, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గులుమురును సందర్శించారు. అంగన్‌వాడీ భవనం మంజూరు చేయాలన్నారు. నాడు-నేడు ద్వారా చేపడుతున్న భవనం పూర్తి చేయాలన్నారు. విడివికె ఏర్పాటుకు గ్రామస్తులు అవకాశం కల్పించాలన్నారు.

ఈ నెలాఖరికి మహిళా మార్ట్ ప్రారంభం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రమైన వీరఘట్టంలో మహిళా మార్ట్‌ను ఈనెలాఖరున ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక మహిళా సమైక్య కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అలాగే అన్ని మండలాల్లో మహిళ మార్ట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఈ ఏడాది ఎస్‌సి, ఎస్‌టి, బిసి ఇంటర్నల్ కులాలకు సంబంధించి 679 మంది లబ్ధిదారులకు కల్యాణమస్తు కింద నాలుగో విడత రూ 4.95 కోట్లు జమ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

నిరవధిక సమ్మెను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - పాలకొండ

సమస్యలు పరిష్కారం కోరుతూ డిసెంబర్ 8నుంచి తలపెట్టిన నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం బుక్కూరు 1,2 అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని, గర్భిణులకు, బాలింతలకు ఫేస్ యాప్ రద్దు చేయాలని, పెండింగ్ బిల్లులు చెలించాలని, తదితర సమస్యలపై చేపడుతున్న సమ్మెకు లబ్ధిదారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎన్.హిమప్రభ, టి.దివ్య, టి.ఇందిర, లబ్ధిదారులు పి.శీదేవి, పి.లతా,కె.సంధ్య, కె.సాతి, యు.కల్పనా పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి ప్రణాళికలు : డిఇఒ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి కల్పనకు ఉపాధ్యాయులు ప్రణాళికలు తయారు చేయాలని డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ సూచించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ప్రధానమైన సమస్యలను ముందుగా గుర్తించి వాటికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇచ్చిన ప్రణాళిక నివేదికను ప్రభుత్వానికి పంపించి తద్వారా మంజూరైన పనులు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒలు చంద్రశేఖర్, బడే జనార్దన్ నాయుడు, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు పాలక దేవానంద్, సింహాచలం, సంజీవ్, సిఆర్పిలు పాల్గొన్నారు.

ఇంగ్లీష్ సబ్జెక్టు పై మెలకువలు అవసరం

స్థానిక జిల్లా ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న (లిప్) అభ్యాసన అభివృద్ధి కార్యక్రమాన్ని డిఇఒ పరిశీలించారు. ఇంగ్లీష్ సబ్జెక్టుపై జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఆంగ్ల బోధనలో విద్యార్థులకు మెలుకువలు నేర్పించాలని సూచించారు. అప్పుడే ఆ సబ్జెక్టుపై ప్రతి విద్యార్థి పట్టు సాధించడానికి వీలుంటుందన్నారు. శిక్షణలో సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ బిడ్డిక భీముడు, ఎంఇఒ చంద్రశేఖర్, రిసోర్స్ పర్సన్ కృష్ణమూర్తి ఉన్నారు.



భామిని : విద్యార్థుల నుంచి సమాధానాలు రాబడుతున్న డిఇఒ ప్రేమ్‌కుమార్

హడ్డుబంగి శిక్షణ కేంద్రం తనిఖీ

సీతంపేట : మండలంలోని హడ్డుబంగి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఎల్‌ఐపి రెండో రోజు జరుగుతున్న శిక్షణ కేంద్రాన్ని డిఇఒ ప్రేమ్‌కుమార్ బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులను అన్ని సబ్జెక్టుల్లో వినుట, మాట్లాడుట, చదువుటం, రాయడం, తదితర సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. శిక్షణలో విని, నేర్చుకొని అమలు చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలన్నారు. ఉత్తీర్ణతపై దృష్టి సారించాలన్నారు. డిఇఒ వెంట డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి, ప్రధానోపాధ్యాయులు బి.ఉమావాణి, డిఆర్‌పిలు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల ఆకస్మిక తనిఖీ

భామిని : స్థానిక ఆదర్శ పాఠశాలను డిఇఒ ప్రేమ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో గ్రంథాలయం, స్పోర్ట్స్ గది, తరగతి గదులు, విద్యార్థులు నోట్ పుస్తకాలు, తరగతి నిర్వహణ అంశాలు పరిశీలించి పాఠశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలపై విద్యార్థినిలను, ఉపాధ్యాయులను అడిగారు. మంచి ఫలితాలు సాధించేలా బోధన నిర్వహించి, విద్యార్థి అభివృద్ధికి పాఠశాలలు తోడ్పాడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ ఎస్.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ రఘు పాత్రుని శివకుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

తహాశీల్దార్ కార్యాలయం వద్ద ఎస్‌ఎఫ్‌ఐ ధర్నా

ప్రజాశక్తి - బలిజిపేట

మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, పోస్టుమెట్రిక్ హాస్టలను నిర్మించాలని, జడ్పీహెచ్ పాఠశాలలో సంక్షేమ హాస్టల్‌ను వెంటనే ప్రారంభించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పి.రాజశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాలల విద్యార్థులతో ఆర్‌టిసి కాంప్లెక్స్ జంక్షన్ నుండి మెయిన్ రోడ్డు మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం ధర్నా నిర్వహించి, తహసీల్దార్ కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ మండలంలో వివిధ జూనియర్ కళాశాలల్లో సుమారుగా 500 మంది వరకు విద్యార్థులు చదువుతున్నారని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం చాలా దారుణమని మండిపడ్డారు. అనేక ఏళ్ల నుంచి డిగ్రీ కళాశాల ప్రతిపాదన ఉన్నప్పటికీ స్థలం కేటాయించి, పనులు ప్రారంభించక పోవడం అన్యాయమని, పాలకుల వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని వాపోయారు. బలిజిపేటలో డిగ్రీ కళాశాల లేకపోవడం వల్ల విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లలేక, పై చదువులకు తావు ేక ఇంటర్ తోనే నిలిచిపోయే పరిస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక దూర ప్రాంతాల గ్రామాలకు మండల కేంద్రం ముఖద్వారమని, ప్రభుత్వ విద్యా సంస్థలకు నిలయంగా నిలిచిన కేంద్రంలో పోస్టుమెట్రిక్ హాస్టలు లేకపోవడంతో్ రోజుల తరబడి ప్రయాణించేందుకు ఆర్థికంగా ఇబ్బందులకు గురౌతున్నారని అన్నారు. కావున, బలిజిపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పోస్టుమెట్రిక్ హాస్టల్‌ను ప్రారంభించాలని, అలాగే లిజడ్పీహెచ్ పాఠశాలలో సంక్షేమ హాస్టల్ భవనాన్ని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వెంటనే నియోజకవర్గ, మండల ఈ సమస్యలపై ఈనెల 24 నుండి 29 వరకు నిరసన దీక్షలు, 30 న ఛలో కలెక్టరేట్ చేడుతున్నామని, ఈ లోపు స్పష్టమైన ప్రకటన ఇవ్వాలని, లేకుంటే పెద్ద ఎత్తున్న ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు దానియల్, జూనియర్ కళాశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



బలిజిపేటలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

రవాణా శాఖకు భూమి అప్పగింత

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఆటోమేటిక్ డ్రైవింగ్ ట్రాక్‌కు అవసరమైన దాదాపు 5 ఎకరాలను భూమిని రెవెన్యూ అధికారులు పార్వతీపురం రవాణాశాఖ అధికారులకు బుధవారం అప్పగించారు. మండల పరిధిలోని నాగూరు సమీపంలోని గతంలో అర్హులైన నిరుపేదలకు ఇళ్లస్థలాల నిమిత్తం భూమిని సేకరించారు. అయితే కొత్త భూమి ఇళ్ల స్థలాలకు కేటాయించగా మరికొంత భూమి ప్రస్తుతం ఖాళీగా ఉంది. ఈ మేరకు గతంలో పార్వతీపురం రవాణా శాఖ అధికారులు ఆటోమేటిక్ డ్రైవింగ్ ట్రాక్ నిమిత్తం ఐదు ఎకరాల స్థలం కేటాయించాలని కోరుతూ రెవెన్యూ శాఖ అధికారులకు ప్రతిపాదనలను అందజేశారు. రవాణాశాఖ అధికారులు అందజేసిన ప్రతిపాదనల మేరకు జిల్లా అధికారుల అనుమతితో ఈ స్థలాన్ని కేటాయించినట్టు తహాశీల్దార్ గేదెల వెంకట జనార్ధన్ తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ వెలగాడ నాగరాజు, సిబ్బంది మందరాడ సుధాకర్ తదితరులు ఉన్నారు.

భూమి మీ హక్కు : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - వీరఘట్టం

భూమిని హక్కు రాబోయే తరాలకు ఉపయోగపడేలా చూసుకోవాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ భూ హక్కుదారులకు సూచించారు. బుధవారం స్థానిక తహాశీల్దార్ కార్యాలయంలో డికెటి పట్టాల పంపిణీ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సిఎం జగన్మోహన్‌రెడ్డి చేశారని అన్నారు. మండలంలో మంచి అధికారులు ఉన్నారని, వారికి సహకరించి మీ తోడ్పాటు ఎల్లప్పుడూ ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా తూడి, ఆడారు, కత్తుల కవిటి గ్రామాలకు చెందిన సుమారు 137 మంది లబ్ధిదారులకు 95 ఎకరాల భూమికి శాశ్వత హక్కు పత్రాలు పంపిణీ చేశారు. తహాశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కెఎల్ ప్రసాదు, పిఎసిఎస్ అధ్యక్షులు కర్రి గోవిందరావు, డిటి బి.కుమారస్వామి, సిఎస్‌టిడి ఎం.మల్లేశ్వరరావు, విఆర్‌ఒలు, ఆయా గ్రామాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌పి తనిఖీ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

వార్షిక తనిఖీల నిమిత్తం స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఎస్‌పి విక్రాంత్ పాటిల్ సందర్శించారు. ముందుగా సిబ్బంది నుండి గౌరవ వందనం స్వీకరించారు. రూరల్ సిఐ స్వామినాయుడు, ఎస్ఐ సింహాచలం పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని ఎస్ రైటర్, ఎస్‌హెచ్‌ఒ, కంప్యూటర్, సిబ్బంది గదులను, కేస్ ప్రాపర్టీ భద్రపర్చిన గదులు, స్టేషన్ చుట్టుపక్కల పరిసరప్రాంతాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న జనరల్ డైరీ, డ్యూటీ రోస్టర్, విలేజ్ రోస్టర్, ప్రాపర్టీ రిజిస్టర్, కోర్ట్‌కు సంబంధించిన రికార్డులు, ఇతర రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు, పోలీస్ స్టేషన్‌లో సీజ్ చేసిన వాహనాలు గురించి అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను, కేసుల్లో దర్యాప్తు జరుగుతున్న విధానం, పురోగతి గూర్చి ఆరా తీసి సదరు కేసుల ఛేదింపునకు దోహదపడే దర్యాప్తు విధి విధానాలపై దిశానిర్దేశం చేశారు.

ప్రాధాన్యత కేసులను గుర్తించి స్పీడ్ ట్రయల్ ద్వారా నిందితులకు శిక్ష పడేలా చూడాలి అని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలని, బ్లాక్ స్పాట్‌ల్లో స్టాపర్లను ఏర్పాటు చేయాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు జాగ్రత్తగా ఉండేలా రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించి వాహన తనిఖీలు నిర్వహించాలని, ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం జరగకుండా రాకపోకలు జరగాలని ఆదేశాలు జారీచేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్ (డ్రంక్ అండ్ డ్రైవ్ ఓపెన్ (డ్రింకింగ్) ఎక్కువగా నమోదుచేయాలని, రానున్న ఎలక్షన్ దృష్ట్యా గ్రామాలను సందర్శించి ముందస్తు సమాచారం సేకరించాలని సూచనలు ఇచ్చారు. స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లపై ప్రత్యేక దృష్టి సారించి, వారి కార్యకలాపాలపై నిరంతర నిఘా కొనసాగించాలిని తెలిపారు. బీట్లు బాగా పెంచి స్టేషన్ పరిధిలో జరిగే రెగ్యులర్ క్రైమ్‌పై ప్రత్యేక దృష్టి సారించి దొంగతనాలను పూర్తిస్థాయి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఒడిశా సరిహద్దు ఉన్నందున నిఘాను ఏర్పాటు చేసి అక్రమ మద్యం రవాణా, అమ్మకాలను అరికట్టేలా తగు చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు. అనంతరం పోలీసు సిబ్బందితో గ్రీవెన్స్ అడిగి తెలుసుకొన్నారు.



ఎస్‌పికి స్వాగతం పలుకుతున్న రూరల్ సిఐ స్వామినాయుడు



క్రీడాకారులను సన్మానిస్తున్న ఉపసర్పంచ్ కాపారావు శివున్నాయుడు

క్రీడాకారులకు సన్మానం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఇటీవల జరిగిన రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలో పాల్గొని ప్రతిభ కనబర్చి, బహుమతులు పొందిన సందర్భంగా వారిని అభినందిస్తూ బుధవారం గ్రామపెద్దలు, సీనియర్ వైసిపి నాయకులు, ఉపసర్పంచ్ కాపారావు శివున్నాయుడు తన స్వగృహంలో విద్యార్థులతో పాటు పాఠశాల పిఇటిని శాలువాలతో సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన స్కూల్‌గేమ్స్‌లోనూ, జిల్లా హేండ్‌బాల్ అసోసియేషన్ నిర్వహించిన పోటీల్లో బాలబాలికలు ప్రతిభ కనబర్చి గ్రామానికి పేరు తీసుకురావడం ఎంతో గర్వకారణంగా భావించి క్రీడాకారులను ప్రోత్సాహించాలనే ఉద్దేశ్యంతో కాపారావు కుటుంబం తరపున వారికి సత్కరించి, ప్రతిభ కనబర్చిన 30మంది విద్యార్థులకు యూనిఫాంలు అందజేసామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డును తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ గీతాంజలి

దబరను సందర్శించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని దబరలో అంగన్వాడీ కేంద్రాన్ని ఎంపిడిఒ కె.గీతాంజలి తనిఖీ చేశారు. పిల్లలతో మాట్లాడి తెలుగు అక్షరాలు గుర్తించడం గమనించారు. విద్యార్థులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలన్నారు. పిల్లలకు ఆటపాటలతో బోధించాలన్నారు. అనంతరం ప్రతినెలా రేషన్ అందుతుందా లేదా గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఆమెతో పాటు అంగన్వాడీ కార్యకర్త తదితరులు ఉన్నారు, అదేవిధంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు.



విద్యార్థుల తల్లిదండ్రులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శ్రీవరం

పిల్లల చదువు పట్ల తల్లిదండ్రులు శ్రద్ధవహించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

విద్యార్థుల అభివృద్ధి కేవలం అధ్యాపకులకే కాక విద్యార్థుల తల్లిదండ్రులపైనా ఉందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ టి.శ్రీవరం అన్నారు. డిగ్రీ కళాశాలలో బుధవారం తల్లిదండ్రుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులను క్రమశిక్షణలో ఉంచి పాఠ్యాంశాల బోధన, ఉద్యోగ ఉపాధి కల్పనకు మార్గాల్లో ఉంటే అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. మరోవైపు ఇంటి వద్ద విద్యార్థులు ఏ విధంగా ప్రవర్తిస్తున్నారు, ఎలా చదువుకుంటున్నారో చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివినాడే భవిష్యత్తులో మంచి స్థానాల్లో నిలవడానికి అవకాశం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రామయ్య, ఎన్ఎస్ఎస్ పిఒ త్రినాధ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్తమ అటల్ స్కూల్‌గా పూతికవలస

ప్రజాశక్తి - సీతంపేట

ఉత్తమ అటల్ పాఠశాలగా పూతికవలస గిరిజన ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాల ఎంపికైంది. ఇటీవల రాష్ట్రటాస్క్ ఫోర్స్ బృందం జిల్లాలో పర్యటించిన ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ పాఠశాలను ఎంపిక చేశారు. జిల్లాలో ఉత్తమ విద్యా, రికార్డులు నిర్వహణ, విద్యార్థుల ప్రతిభ, మంచి ఫలితాలతో ఉన్న ఈ పాఠశాలలు ఉత్తమ ఎఎల్‌టి పాఠశాలగా ఎంపికైంది. ఈ సందర్భంగా విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌లో స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు చేతుల మీదుగా డిఎస్ఒ లక్ష్మణరావు, ఎఎల్‌టి ఇన్‌ఛార్జి హేమలత సర్టిఫికెట్, మెమోంటోను అందుకున్నారు.

సత్తాచాటిన 'సత్యసాయి' విద్యార్థులు

ప్రజాశక్తి - పాలకొండ

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ ఇటీవల విడుదల చేసిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ ఫలితాల్లో స్థానిక సత్యసాయి డిగ్రీకాలేజీ విద్యార్థులు సత్తా చాటారు. ఈ కాలేజీలో బిఎస్‌సి (ఎంపిసి) చదివిన ఉయ్యూరు హరిత పదికి పదిపాయింట్లు సాధించారు. అలాగే దలై నందిని 9.53, తమ్మిన అజయ్ 9.18, వై.హారిక 9.12, గిరజాల జ్యోతి బిజెడ్‌సిలో 8.24, ఆడంగి లావణ్య (బిఎ) 8.8 ఫలితాలు సాధించారు. ఎంపీసీ, గ్రూపులో 10కి పది పాయింట్లు ఈ కళాశాల ఐదు గురు విద్యార్థులు సాధించారు. వీరిని ప్రిన్సిపల్ ఎ.శ్రీనివాసరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి.వెంకటరమణ, కళాశాల అకాడమిక్ అడ్వైజర్ బి.లక్ష్మీనారాయణ, కళాశాల అధ్యాపక బృందం అభినందించారు.

కానరాని దోమల నివారణ చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలో మురికి పాలన సాగుతోందని జనసేన నాయకులు ఎద్దేవా చేశారు. బుధవారం పార్వతీపురంలో జనసేన నాయకులు వంగల దాలి నాయుడు, అన్నాబత్తుల దుర్గాప్రసాద్, తామరఖండి తేజ, పసుపురెడ్డి పూర్ణచంద్ర ప్రసాద్, కె.సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ మున్సిపాలిటీలోని మురుగు కాలువలో మురుగు తొలగించకపోవడంతో దుర్గంధం వ్యాపిస్తోందన్నారు. దోమలు ఎక్కువగా పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దోమల నివారణకు చర్యలు చేపట్టే దాఖలాలు కానరావడం లేదన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గాడి తప్పిన పురపాలను గాడిలో పెట్టాలన్నారు.

చల్లంనాయుడువలసలో కాలువ, రోడ్డు పనులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చల్లంనాయుడు వలసలో మజ్జినీలాటివీధి రేవు వద్ద సిసి కాలువ, రోడ్ల పనులను మాజీ ఎంపిటిసి సభ్యులు దాసరి నాగరత్న ఆధ్వర్యంలో చురుగ్గా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రోడ్డు సిసి రోడ్లకు కాలువల కోసం ఎమ్మెల్యే ఎ.జోగారావు దృష్టికి తీసుకు రాగా, వారి సహకారంతో రూ.5లక్షలు నిధులు మంజూరు చేయడంతో ఈ పనులు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో దాసరి అప్పన్నతో పాటు పలువురు ఉన్నారు.



సిసి రోడ్డు పనులు చేయిస్తున్న మాజీ ఎంపిటిసి సభ్యులు నాగలక్ష్మి దంపతులు

గడువులోగా భవనాలు పూర్తి కావాల్సిందే

ప్రజాశక్తి - సీతానగరం

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ప్రాధాన్యత భవనాలు గడువులోగా పూర్తి కావాల్సిందేనని కలెక్టర్ నిశాంత్ కుమార్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మండలంలోని పెద్దభోగిలి, బూర్జ గ్రామాల్లోని నిర్మాణంలో ఉన్న గ్రామ సచివాలయం పనుల పురోగతిని బుధవారం పరిశీలించారు. నిర్మాణ దశలో ఉన్న పనులకు ఎంత మేర బిల్లుల చెల్లింపులు జరిగినవి వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణం జాప్యం జరగకుండా అవసరమైన సామాగ్రిని ముందస్తుగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిర్మాణం పూర్తి చేసిన పనులకు సంబంధించిన బిల్లులను వెంటనే అప్లోడ్ చేయాలని, నిధులు సమస్య లేనందున బిల్లులు తక్షణ చెల్లింపులకు చర్యలు తీసుకుంటామని అన్నారు. పెద్ద భోగిలి గ్రామ సచివాలయం ఫ్లోరింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేసి భవనాన్ని అప్పగించనున్నామని ఇంజనీరింగ్ అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. ఇంజనీరింగ్ అధికారులు నిర్మాణ పనులు పూర్తికి ఇచ్చిన సమయం ప్రకారం పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. జాప్యం జరగరాదని స్పష్టం చేశారు. ప్రాధాన్యతా భవనాలు పూర్తి చేసి అవసరమైన వసతికి సంబంధిత కార్యాలయాలకు సమకూర్చాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ, ఎంపిడిఒ కృష్ణమహేష్‌రెడ్డి, ఎఇ శంకరరావు, ఆర్ఐ ఎన్.శ్రీనుబాబు, గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.



పెదబోగిలిలో సచివాలయ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

ఆర్‌బికెలతో రైతులకు మరిన్ని సేవలు

ప్రజాశక్తి - సీతానగరం

రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్ని రకాల సేవలు అందుబాటులో వస్తున్నాయని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని గుచ్చిమిలో రూ.24లక్షల నిధులతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, యాంత్రీకరణ పరికరాలు లభ్యమవుతాయన్నారు. రైతులు వ్యవసాయాధికారుల సేవలు సకాలంలో అందుబాటులో ఉంటున్నాయని, కావున రైతులు ఆర్‌బికెలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, వ్యవసాయశాఖ అధికారులు, సచివాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అచ్చపువలసలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని అచ్చపువలస గిరిజన గ్రామంలో బుధవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి పి.ఉమామహేశ్వరి వివిధ రకాలైన రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని రాయగడజమ్ము పంచాయతీ పరిధిలోని గొరడలో బుధవారం నాబార్డ్ సహకారంతో జట్టు సంస్థ, ప్రకృతి వ్యవసాయ విభాగం పర్యవేక్షణలో తాడంగి అరుణ మా తోటలో అంతర పంటగా వేసిన శ్రీ రాగిలో 5x5 పంటకోత ప్రయోగాన్ని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ పి.షణ్ముఖరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ పురుగులు, తెగుళ్లను తట్టుకునే శక్తి కలిగి, పెట్టుబడులు తక్కువ, నీటి తడులు తక్కువగా ఉండి, మార్కెట్లో రేటు అధికంగా ఉండే చిరుధాన్య పంటలైన రాగులు, కొర్రలు, సామలు, ఊదలు, ఆరికలు, జొన్నలు మొదలగునవి వేసుకోవడం వల్ల రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు కుటుంబానికి కావాల్సిన అన్ని రకాల పోషకాలు కలిగిన ఆహార ఉత్పత్తులు లభ్యమవుతాయని తెలిపారు. జిల్లాలోని 15 మండలాల్లో పోడు, మెట్టు ప్రాంతాల్లో చిరుధాన్యాలు వేయాలని అందుకు సిబ్బంది అందుబాటులో ఉండే సూచనలు, సలహాలు ఇవ్వాలని, ప్రస్తుత రబీ సీజన్లో అపరాలైన పెసలు, మినుములు, ఉలవలు, వేరుశనగ, సూర్యకాంతం మొదలగు పంటలు వేసుకోవడం వల్ల పంట మార్పిడి విధానం పాటించడంతో పాటు భూమిని సారవంతం చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. మొక్కల్లో జీవవైవిధ్యం, భూమిలో సేంద్రీయ కర్బన శాతం పెరుగుతుందని, ప్రతి రైతు తమకున్న విస్తీర్ణంలో తప్పనిసరిగా చిరుధాన్యాలు వేయాలని సూచించారు. నాబార్డ్ సహకారంతో జట్టు ట్రస్ట్ మా తోట ప్రాంతంలో వేసిన పలు పంటలను, జీవామృతాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎ జి.అన్నపూర్ణ, జీవా కోఆర్డినేటర్ జి.ప్రొబోద్, రైతులు టి. అమరావతి, చిట్టిబాబు, సిబ్బంది పి.జగదీష్, టి.మన్మధరావు, శ్రీహరి, జి.మురళీమోహన్ పాల్గొన్నారు.

పెదభోగిలిలో 'జగనే ఎందుకు కావాలంటే'

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదభోగిలి హడ్కో కాలనీలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే డోర్ టూ డోర్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అలజంగి జోగారావు బుధవారం నిర్వహించారు. ఇంటి ఇంటికి వెళ్లి వైసిపి పాలనలో ప్రజలకు మేలు జరిగిన విధానం, గత పాలనలో చేసిన మోసం గురించి ప్రజలకు వివరిస్తూ, మీ అందరికీ మంచి చేసిన సిఎం జగన్‌కు మళ్లీ మద్దతు నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ బొంగు చిట్టి రాజు, జెడ్పీటీసీ సభ్యులు మామిడి బాబ్జీ, ఎంపిపి ప్రతినిధి బలగ శ్రీరాములు నాయుడు, జెసిఎస్ కన్వీనర్ సురేష్, స్థానిక సచివాలయం కన్వీనర్లు రమేష్, కుర్మారావు, స్థానిక వార్డు మెంబర్ పి.సతీష్, మండల వైసిపి నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

పాలకొండ: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని భాసురువారి వీధి సచివాలయం పరిధిలోని ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే అన్న కార్యక్రమం ఎమ్మెల్యే వి.కళావతి, శాసన మండలి ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఇంటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించి, రాబోవు రోజుల్లో జగన్ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్లు రౌతు హనుమంతరావు, పల్లా ప్రతాప్, కౌన్సిలర్లు వెలమల మన్మధ రావు, కడగల అనూరాధ వెంకటరమణ, తుమ్మగుంట అనూష శంకరరావు, తూముల కళావతి లక్ష్మణరావు, భాసూరు కాంతారావు, కె.మోహన్‌రావు, కొంచాడ అరుణ్, దుప్పాడ పాపినాయుడు, కొడెం సాయికృష్ణబాబు, ఆకుల కుమార్, ముద్దాడ చక్రవర్తి, చంద్రమౌళి, గణపతి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



పాలకొండలో వైసిపి జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

పార్వతీపురం రూరల్ : మండలంలోని ఎంఆర్ నగరంలో జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఎగురవేసి అనంతరం ఆ గ్రామానికి వైసీపీ ప్రభుత్వంలో వచ్చిన నిధుల పట్టికను విడుదల చేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి బలగ రేవతమ్మ నాగేశ్వరరావు, ఎంపిపి మజ్జి శోభారాణి, సర్పంచి వంగపండు లక్ష్మీ త్రినాధ, ఎంపిటిసి సభ్యులు బడే రామారావు, మండల వైసిపి కన్వీనర్ బొమ్మి రమేష్, నాయకులు భీమవరపు కృష్ణమూర్తి, మడక విశ్వనాథం, జక్కు ప్రవీణ్ కుమార్, వెంపల గురురాజు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి - కురుపాం

చంద్రబాబు నాయుడు తోనే ప్రజల భవిష్యత్తుకు షూరిటీ ఉంటుందని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి టి.జగదీశ్వరి అన్నారు. మండలంలోని ఉదయపురం పంచాయతీలో గల పలు గిరిజన గ్రామాల్లో బుధవారం బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి తెలుగుదేశం అధికారంలోకి వస్తే తీసుకొస్తున్నటువంటి పథకాలు గురించి వివరించి రానున్న ఎన్నికల్లో కచ్చితంగా టిడిపికి ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో టిడిపి మహిళా కార్యవర్గ సభ్యులు వెంపటాపు భారతి, నాయకులు మల్లికార్జున, చిరంజీవి, తిరుపతి, ఉపసర్పంచ్ నాగభూషణరావు, పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : మండలంలోని కృష్ణపల్లిలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులతో కలిసి బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి పార్టీ కరపత్రాలను మేనిఫెస్టో వివరాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు గొట్టాపు వెంకటనాయుడు, ఎఎంసి మాజీ చైర్మన్ రెడ్డి శ్రీనివాసరావు, అశోక్, పోల సత్యనారాయణ, బలగ శంకరరావు, కూనపురెడ్డి ప్రసాదు, పెంటమ్మ తదితరులు పాల్గొన్నారు.

భామిని : మండలంలోని నులకజోడు, దిమ్మిడి జోలలో బాబు షూరిటీ, భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి మినీ మేనిఫెస్టో సూపర్ సిక్స్ అంశాలను, రాష్ట్రంలో టిడిపి రావాల్సిన ఆవశ్యకతను పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక బాలకృష్ణ వివరించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బోగాపురపు రవినాయుడు, ప్రధాన కార్యదర్శి మెడిబోయిన జగదీశ్వరరావు, భూపతి ఆనందరావు, చిన్ని రవి, అబోతుల త్రినాధరావు, గొర్ల విజయకుమార్, సారాబు చంద్ర, రౌతు పాపినాయుడు, వాసు, సూర్యారావు, మధు, బెజడ గోవిందరావు, టిడిపి కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కురుపాం : ఉదయపురంలో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు జగదీశ్వరి

పంటల పరిశీలన

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని ఆజూరు పరిధిలో వేసిన చోడి, వరి, జొన్న పంటలను మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ మొక్కజొన్న సాగు కంటే చిరుధాన్యాల సాగే ఉత్తమమని, అతి తక్కువ ఖర్చుతో తక్కువ రోజుల్లో చిరుధాన్యాలతో అధిక దిగుబడి సాధించవచ్చునని తెలిపారు. ప్రభుత్వం కూడా చిరుధాన్యాలకు మంచి మద్దతు ధర ఇచ్చిందన్నారు. తెల్లజొన్నకు క్వింటాకు రూ.3225, చోడికి క్వింటాకు రూ.3846 మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరిస్తుందని తెలిపారు. ఎకరా వరి సాగుకు అయ్యే నీటి ఖర్చుతో మూడు నుండి ఐదెకరాల చిరుధాన్యాలను సాగు చేయవచ్చని, రైతులు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు. అలాగే మొక్కజొన్న పంటలో కూడా ఖరీఫ్ దిగుబడులు తక్కువగా ఉంటాయని, కావున ఖరీఫ్‌లో చిరుధాన్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. గిరిజన రైతులు మొక్కజొన్న పంటకు మాత్రమే సేంద్రియ ఎరువులు వేస్తున్నారని, ఆ ఎరువులను చిరుధాన్యాలకు వేసినట్లయితే దిగుబడులు గణనీయంగా పెరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎల్ టు ఐసిఆర్‌పి విజయ్ పాల్గొన్నారు.

వాహనాలకు జిపిఎస్ తప్పనిసరి

ప్రజాశక్తి - వీరఘట్టం

ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి లోడు చేసి తీసుకువెళ్లే వాహనాలకు తప్పనిసరిగా జిపిఎస్ బిగించాలని తహశీల్దారు సిహెచ్ సత్యనారాయణ విఆర్ఒలకు ఆదేశించారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో విఆర్ఒలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిపిఎస్ అమర్చే వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఎటువంటి లోపాలున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే గ్రామాల్లో ప్రజలకు పంపిణీ చేసే బియ్యంపై దృష్టి పెట్టాలన్నారు. భూ సర్వే కార్యక్రమం కూడా వేగవంతం చేసేందుకు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఉపతహశీల్దార్ బి.కుమారస్వామి, సిఎస్‌డిటి ఎం.మల్లేశ్వరరావు, విఆర్ఒలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

మక్కువ: ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు వినియోగించనున్న 43 ట్రాక్టర్లకు ఇంతవరకు జిపిఎస్ అమర్చినట్టు తహశీల్దార్ ఎ.సూర్యనారాయణ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 150 ట్రాక్టర్లు లక్ష్యంగా చేసుకున్నామని ఆయన అన్నారు. జిపిఎస్ లేని ట్రాక్టర్లతో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించినట్లయితే సంబంధిత ట్రాక్టర్లకు అద్దె చెల్లింపు జరగదని ఈ విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలని ఆయన తెలిపారు.

గరుగుబిల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లులకు ధాన్యమును తరలించే ట్రాక్టర్లకు జిపిఎస్‌ను ఏర్పాటు చేసినట్టు తహశీల్దార్ గేదెల వెంకటజనార్ధన్ అన్నారు. ప్రస్తుతం 62 ట్రాక్టర్లకు జిపిఎస్‌ను ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల నుండి ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు లో రైతుల బయో మెట్రిక్ నమోదు తప్పనిసరిగా చేయాలన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి - సాలూరు

అపార్ట్‌మెంట్ వాసులు అగ్ని ప్రమాదాలపై అవగాహన పెంచుకోవాలని స్థానిక అగ్నిమాపక స్టేషన్ అధికారి యు.సుధాకరరావు కోరారు. బుధవారం పట్టణంలోని షల్జ్ పేటలో అపార్ట్ మెంట్ వాసులకు అగ్నిప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపార్ట్‌మెంట్లలో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రమాదాలు జరగకుండా ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.



ఫిష్ ఆంధ్రా షాపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

'ఫిష్ ఆంధ్ర'తో నిరుద్యోగులకు ఉపాధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

నిరుద్యోగులకు ఉపాధి కల్పన అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించిందని స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి తెలిపారు. గుమ్మలక్ష్మీపురంలో రూ.20 లక్షల యూనిట్‌తో ఫిష్ ఆంధ్ర ప్రదేశ్‌ను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుద్యోగులకు ఫిష్ ఆంధ్ర ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఫిష్ ఆంధ్ర నిర్వహణ ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని నిర్వాహకులు యామాల తారకేశ్వరరావుకు సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి కె దీనమయ్య, వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్ , జడ్పిటిసి రాధిక, గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బి గౌరీ శంకర్ రావు వైసిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

శిథిలావస్థలో వాటర్ ట్యాంకు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురంలో గల వాటర్ ట్యాంక్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో గత రెండు రోజుల నుంచి ప్రజలకు తాగునీరు అందడం లేదు. ఇదే సమస్యను స్థానిక సర్పంచి బొత్తాడ గౌరీశంకరరావు ఆర్డబ్ల్యూఎస్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా బుధవారం డిఇఇ కె.నాగేశ్వరరావు వచ్చి పరిశీలించారు. 20ఏళ్ల కిందట నిర్మించిన వాటర్ ట్యాంకుకు మరమ్మతులు చేయకపోవడంతో పూర్తిగా శిథిలమైందని సర్పంచ్ విన్నవించారు. ఈ ఒక్క ట్యాంక్‌పైనే ఆధారపడ్డ గ్రామస్తులకు ప్రతిరోజు తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. దీని స్థానంలో కొత్త ట్యాంక్ మంజూరు చేయాలని అభ్యర్థించారు. సమస్యపై స్పందించిన ఆర్డబ్ల్యూఎస్ అధికారులు మాట్లాడుతూ ట్యాంకు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టి దాని స్థానంలో కొత్త ట్యాంకు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

26న రాజ్యాంగ దినోత్సవం

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 26 ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవంను నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.

అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఎసిడిపిఒ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని పూతికవలస అంగనవాడీ కేంద్రాన్ని బుధవారం ఐసిడిఎస్ ఎసిడిపిఒ ఎన్.రాజ్యలక్ష్మి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో గల స్టాక్ రిజిస్టర్లు నిల్వ ఉన్న సరుకులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అంగన్వాడీ వర్కర్ హెల్పర్‌తో మాట్లాడుతూ గర్భిణీలకు, బాలింతలకు సకాలంలో పౌష్టికాహారం అందించి రక్తహీనత సమస్యతో ఎవరూ బాధపడకుండా ఉండేలా ప్రత్యేక చొరవ తీసుకొని అంగన్వాడీ కేంద్ర పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచి పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంచి నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు వివి రమణమ్మ, విజయగౌరి, శ్రావణి పాల్గొన్నారు.

సక్రమంగా విధులు నిర్వహించాలి

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

ఉద్యోగులు ఎక్కడైనా తమ ఉద్యోగ ధర్మాన్ని సక్రమంగా నిర్వర్తించేలా ఉండాలని ఎంఇఒ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక మండల రిసోర్స్ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఐఇఆర్ టి.పద్మ బలిజిపేట మండలానికి బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ మేరకు ఎంఇఒ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉద్యోగులు క్రమశిక్షణగా ఉద్యోగ ధర్మాన్ని పాటిస్తే ఎక్కడైనా అభినందనలు అందుకుంటారని అన్నారు. అలాగే గుమ్మలక్ష్మీపురం మండలంలో విధులు నిర్వహించినట్లు బలిజిపేటలోనూ విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 బడే జనార్ధన్ నాయుడు, సీఆర్పీలు, ఎంఇఒ కార్యాలయం సిబ్బంది, తదితరులు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

బస్సు నుండి జారిపడి విద్యార్థికి గాయాలు

ప్రజాశక్తి - భామిని

బస్సు నుంచి జారిపడి రెండు కాళ్లకు గాయాలు పాలైన శాసనపూరి రెస్మా ఘటన మరువక ముందే, బుధవారం మరో విద్యార్థి చైతన్య తాను ప్రయాణిస్తున్న బస్సు ఫుట్ బోర్డు నుండి జారి మోకాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం జరిగిన సంఘటనకు స్పందించిన ఆర్‌టిసి డిఎం విద్యార్థుల ప్రత్యేక బస్సును మంగళవారం ఏర్పాటు చేసి, విద్యార్థులు రాకపోకలు సాగించాలని తెలిపారు. మళ్లీ ఇలా జరగడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల సిబ్బంది, స్థానిక పోలీస్ సాయంత్రం వేళలో విద్యార్థులు ఎక్కేటప్పుడు పరుగులు పెట్టకుండా, ఫుట్ బోర్డుపై ప్రయాణించకుండా నిలువరిస్తే ఇటువంటి ప్రమాదం పునరావృతం కావని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ట్రాక్టర్ ఢీకొనడంతో ద్విచక్రవాహనదారు గాయాలు పాలైన సంఘటన బుధవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. బలిజిపేట మండలం పణుకుపేటకు చెందిన సంకాలోక్‌నాధ్ గుప్తా అనే వ్యక్తి తన గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై బొబ్బిలి వెళ్తుండగా, గ్రామం దాటిన తర్వాత పీతలబంద సమీపాన మలుపు దగ్గర ట్రాక్టర్ ఎదురుగా వచ్చి ఢీకొనడంతో గాయాలయ్యాయి. స్పందించిన స్థానికులు 108 వాహనంలో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔట్‌పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేశారు.

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని రేగులపాడు సమీపంలో సీఎస్పీ రహదారిలో బుధవారం బొగ్గు లారీ బోల్తా పడింది. డ్రైవర్, క్లీనర్‌కు ఎటువంటి గాయాలు కాకపోవడంతో పెద్ద పెను ప్రమాదం తప్పింది. తరచుగా ఈ రహదారిపై భారీ వాహనాల రాకపోకలు సాగించడం వల్ల ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. వీటిపై అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

180 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని రెల్లివీధిలో ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో 180 లీటర్ల నాటు సారాను సీజ్ చేసి, సొండి చంద్ర , గండి బాబూరావు,రాజాన సుహాసిని ఒడిషా రాష్ట్రానికి చెందిన కొండగొర్రి సాంబా అను వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ ఉపేంద్ర తెలిపారు. ఈ దాడుల్లో స్పెషల్ ఎన్‌ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్స్పెక్టర్ సతీష్, ఎస్సైలు జె.రాజశేఖర్, వి.వి.రమణ మరియు సిబ్బంది పాల్గొన్నారు.